
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం ၊ 28 ၊ అక్టోబర్ ၊ 2024



సోమశిలలో 64.616 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారానికి 64.616 టీఎంసీల నీరు ఉంది. ఎగువ నుంచి 24,433 క్యూసెక్కుల వరద వస్తోంది. కండలేరుకు 10 వేలు, దిగువకు 355 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.81,320
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.7,360
3 శాతం జీఎస్టీతో	రూ.7,581
నవర (8 గ్రా)	రూ.60,648

గరిష్ఠం/కనిష్ఠం
35.8 /26.8

వాతావరణం

జిల్లాలో సోమవారం పొడిగా, మధ్యాహ్నం నుంచి పాక్షికంగా మేఘావృతంగా ఉంటుందని వాతావరణశాఖాధికారులు తెలిపారు ఆదివారం గాలిలో తేమ 51 శాతం ఉంది.

న్యూస్‌రీల్

వర్సిటీ పోటీలకు ప్రభుత్వ బీఈడీ కళాశాల క్రీడాకారులు



చిన్నిబాబు, బాస్కెట్ బాల్



కె.యువరాజ్, కబడ్డీ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): అంతర్ విశ్వవిద్యాలయాల క్రీడాపోటీలకు నెల్లూరు ప్రభుత్వ బీఈడీ కళాశాల క్రీడాకారులు విక్రమసింహపురి విశ్వవిద్యాలయ జట్టుకు ఎంపికయ్యారని ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వేణుగోపాల్ ఆదివారం తెలిపారు. ఈ నెల 30 నుంచి చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జరిగే అంతర్ విశ్వవిద్యాలయాల కబడ్డీ పోటీలకు తమ కళాశాల క్రీడాకారుడు కె.యువరాజ్ ఎంపికయ్యారన్నారు. నవంబరు ఒకటో తేదీ నుంచి బెంగళూరు క్రిస్ట్ యూనివర్సిటీలో జరిగే ఇంటర్ యూనివర్సిటీ బాస్కెట్‌బాల్ పోటీలకు తమ కళాశాల విద్యార్థి పి.చిన్నిబాబు ఎంపికయ్యారని వివరించారు. కళాశాల పీడీ ఎం.రవీంద్రబాబు, సిబ్బందిని అభినందించారు.

సర్పంచ్‌పై టీడీపీ నేతల దాడి

సోమశిల: అనంతసాగరం మండలంలోని రేవూరు సర్పంచ్‌పై టీడీపీ నేతలు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన ఆదివారం జరిగింది. సోమవారం మంత్రి ఆనం పర్యటన ఉన్న నేపథ్యంలో ఆదివారం ఉద యం గ్రామ సమీపంలోని రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లను జేసీబీతో తొలగిస్తున్న సర్పంచ్ ఆత్మకూరు బుజ్జమ్మ భర్త వెంకటేశ్వర్లుపై టీడీపీకి చెందిన పెంచలయ్య దురుసుగా ప్రవర్తించాడు. అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొనడంతో చుట్టుపక్కల వారు సర్ది చెప్పి పంపించడంతో సద్దుమణిగింది. అయితే మళ్లీ సర్పంచ్ ఇంటికి వెళ్లి దాడికి పాల్పడ్డారు. ఈ దాడుల్లో ఇరువర్గాల్లో పలువురు గాయపడ్డారు. ఈ ఘటనపై ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి కేసు నమోదు చేస్తున్నారు.

ఇళ్ల మధ్య బెల్టు షాప్ వద్దన్నందుకు దాడి



గాయపడిన గిరి

కోవూరు: ఇళ్ల మధ్యలో బెల్టు షాప్ ఏర్పాటుపై అభ్యంతరం చెప్పాడని దారి కాచి ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటన ఆదివారం ఇనమడుగు సెంటర్‌లో జరిగింది. బాధితుడు, పోలీసుల కథనం మేరకు.. మండలంలోని వేగూరు వసంతపురంలో శనివారం రాత్రి మద్యం అమ్ముతున్నారన్న విషయంపై స్థానిక మహిళలు వెంకటరమణయ్యతో కలిసి వెళ్లి కోవూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వస్తామని చెప్పడంతో మహిళలు తిరిగి వెళ్లి పోయారు. ఈ విషయం తెలుసుకున్న బెల్టు షాప్ నిర్వాహకులు నరసింహులు, ఈశ్వర్, నారాయణ మహిళలతో దురుసుగా ప్రవర్తించారు. ఆ విషయాన్ని మనసులో పెట్టుకుని మాపైనే పోలీసులకు చెబుతావా అని వెంకటరమణయ్యను ఇనమడుగు సెంటర్లో కర్రతో తలపై కొట్టాడు. గమనించి అటుగా వెళ్తున్న నెల్లూరు గిరి అడ్డుపడడంతో అతనితో దురుసుగా ప్రవర్తించి అతనిపై కూడా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. పోలీసులు ఇరుపక్షాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి 'దివాలీ విత్ మై భారత్'

నెల్లూరు (వీఆర్సీసెంటర్): 'మై భారత్' మొదటి వార్షికోత్సవం సందర్భంగా నెహ్రూ యువజన కేంద్రం, ఎన్ఎస్ఎస్, కృష్ణచైతన్య డిగ్రీ కళాశాలల ఆధ్వర్యంలో సోమవారం నుంచి 30వ తేదీ వరకు 'దివాలీ విత్‌మై భారత్' కార్యక్రమాలు చేపడుతున్నట్లు జిల్లా నెహ్రూ యువజన కేంద్రం అధికారి మహేంద్రరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ట్రాఫిక్ నియంత్రణపై నగరంలోని వీఆర్సీ సెంటర్‌లో అవగాహన కార్యక్రమం, 29వ తేదీన కూరగాయల మార్కెట్ శుభ్రం చేయటం, 30వ తేదీ సర్వజన ఆస్పత్రి ఆవరణ శుభ్రపరచడం జరుగుతుందని తెలిపారు. యువతలో సేవా భావాన్ని పెంచడం, దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరిని భాగస్వామ్యులు చేయడమేనని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 99635 33440 నంబరులో సంప్రదించాలని కోరారు.

నేడు ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ సమావేశం

నెల్లూరు(సెంట్రల్): ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ అమితాబ్‌శుక్లా, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ వల్లూరు సుబ్రహ్మణ్యం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గూడూరులోని గోగినేనిపురంలో ఉన్న రవి ఇన్సులేటింగ్ కంపెనీలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

తమ్ముళ్లు భూచోళ్లు

- అధికార మదంతో బరితెగిస్తున్న తమ్ముళ్లు
- ప్రభుత్వం వచ్చిన నాలుగు నెలల్లోనే వందలాది ఎకరాల భూకబ్జా
- దేవదాయ, ప్రభుత్వ భూములను వదలని వైనం
- ఒత్తిళ్లతో పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- వెంకటాచలంలో రూ.8 కోట్ల భూమి ఆక్రమణ యత్నం
- వరికుంటపాడులో రూ.15 కోట్లు విలువైన శ్రీమదన వేణుగోపాలస్వామి భూమి కబ్జా
- ఉదయగిరి నియోజకవర్గంలో దాదాపు 700 ఎకరాల ఆక్రమణ
- ఒక్క మర్రిపాడులోనే 100 ఎకరాలు

జిల్లాలో టీడీపీ తమ్ముళ్లు.. భూచోళ్లుగా అవతరించారు. అధికార మదంతో బరితెగిస్తున్నారు. రూ.వందల కోట్ల విలువైన వందలాది ఎకరాల ప్రభుత్వ, ప్రైవేట్ భూములను కబ్జా చేస్తున్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇసుక, గ్రావెల్, మట్టిని కొల్లగొట్టి రూ.కోట్లు దోచుకున్న ఆ పార్టీ నేతలు, కేడర్ ఇప్పుడు ప్రభుత్వ, దేవదాయశాఖ భూములపై రాబందుల్లా పడ్డారు. దేవాలయాలకు పూర్వీకులు, దాతలు ఇచ్చిన భూములకు సంబంధించి ఏకంగా రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి స్వాహా చేస్తున్నారు. ఈ భూముల దోపిడీని అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. కొన్ని చోట్ల ప్రతిపక్షాలు రచ్చ చేయడంతో అక్కడ తాత్కాలికంగా బోర్డులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారు. కొన్ని చోట్ల భూ ఆక్రమణలను అడ్డుకుంటే.. మరో చోట ఆక్రమిస్తూ రెవెన్యూ అధికారులకు సవాల్ విసురుతున్నారు.



ఉదయగిరి మండలం చౌడేపల్లి రెవెన్యూలో ఆక్రమించిన భూమిలో సాగు చేసిన మినుము పంట

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలోని ఉదయగిరి, ఆత్మకూరు, సర్వేపల్లి నియోజకవర్గాల్లో పచ్చచొక్కాల భూచోళ్ల భూముల చుట్టూ కంచెలు నాటేసి దురాక్రమణ చేస్తున్నారు. ప్రభుత్వ, దేవదాయశాఖ భూములు పచ్చ నేతల కబ్జాకోరల్లోకి చేరుతున్నాయి. ఉదయగిరి నియోజకవర్గంలో ఎనిమిది మండలాల్లో దాదాపు 700 ఎకరాల బీడు భూములను టీడీపీ నేతలు కబ్జా చేసి పంట సాగుకు అనుకూలంగా అభివృద్ధి చేస్తున్నారు. వరికుంటపాడులో టీడీపీ నేతలు ఏకంగా రూ.15 కోట్ల విలువైన శ్రీమదన వేణుగోపాల స్వామి ఆలయ భూముల చుట్టూ కంచె వేసి తమ గుప్పెట్లోకి తీసుకున్నారు. పత్రికల్లో కథనాలు వచ్చినా సంబంధిత అధికారులు పట్టించుకోలేదు. మర్రిపాడులో 80 ఎకరాలు కబ్జాకు టీడీపీ నేతలు యత్నించారు. ఈ విషయమై పత్రికల్లో కథనాలు రావడంతో ఆర్డీఓ వెళ్లి నిషేధిత బోర్డును ఏర్పాటు చేశారు. ఇది ఆగిపోవడంతో అదే మండలం కంపసముద్రంలో సర్వే నంబరు 425, 426, 427లో సుమారు 80 ఎకరాలకుపైగా భూములు టీడీపీ నాయకులు భూ ఆక్రమణలు చేశారు. కదిరినాయుడుపల్లిలో సర్వే నంబరు 67లో 20 ఎకరాలకుపైగా టీడీపీ నేతలు ఆక్రమించారు. కృష్ణాపురం వద్ద నేషనల్ హైవే రోడ్డు సమీపంలో రూ.కోటి పైగా విలువ చేసే ఎకరా భూమిని పచ్చ నేతలు ఆక్రమించారు.

రూ.15 కోట్ల దేవదాయశాఖ భూమి హాంఫట్

ఉదయగిరి నియోజకవర్గంలో వరికుంటపాడు మండలం వేంపాడు రెవెన్యూ సర్వే నంబరు 78/1లో 6.08 ఎకరాల భూమిని పూర్వం ఓ దాత ప్రకాశం జిల్లా పామూరులో ఉన్న శ్రీమదన వేణుగోపాల స్వామి దేవస్థానానికి ఇచ్చారు. 1956 ఫసలీ నుంచి రెవెన్యూ రికార్డుల్లో (ఫేర్ అడంగల్‌లో) శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం పేరుపై భూమి నమోదై ఉంది. దేవదాయ ధర్మదాయశాఖ సెక్షన్ 43 రిజిస్టర్‌లో కూడా నమోదైంది. అంటే ఈ భూమి దేవదాయశాఖకు చెందినదే అని అన్నీ రికార్డుల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ఇందులో 3 ఎకరాల భూమిని 2016



చవటపాళెం పంచాయతీ ఎర్రగుంటలో టీడీపీ నేతలు ఆక్రమించి చదును చేసిన భూమి

వరికుంటపాడు, దుత్తలూరు, వింజమూరు, కొండాపురం, ఉదయగిరి మండలాలలో మేత పోరంబోకు, అటవీ పోరంబోకు, కొండ పోరంబోకు భూములను యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారు. దుత్తలూరు మండలంలోని బ్రహ్మేశ్వరం సర్వే నంబరు 448/1లో సుమారు వందెకరాలకుపైగా భూములు ఆక్రమించి సాగుచేసుకుంటున్నారు.

- వరికుంటపాడు మండలంలోని జడదేవిలో 200 ఎకరాల కొండ పోరంబోకు భూముల్లో నాలుగు రోజుల నుంచి యంత్రాల ద్వారా చెట్లు, ముళ్లపొదలు తొలగించి ఆక్రమించే ప్రయత్నం చేయడంతో గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో తాత్కాలికంగా భూ ఆక్రమణలకు బ్రేక్ పడింది.
- బొంగరాలపాడు రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 69లో సుమారు 250 ఎకరాలకుపైగా ఆక్రమించి మినుము, దోస సాగు చేస్తున్నారు.
- గణేశ్వరపురం సర్వే నంబరు 196, 169ల్లో వందెకరాలకుపైగా మేత పోరంబోకు భూములను ఆక్రమించి మెట్టపైర్లు సాగు చేస్తున్నారు. దీనిపై గ్రామస్తులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు.
- కొండాపురం మండలం లింగనపాళెం సర్వే నంబరు 285, మర్రిగుంటలో 207/1, 217/26, ఉప్పలూరు సర్వే నంబరు 287/1లో సుమారు 800 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయి. ఇంత జరుగుతున్నా అధికారులకు మాత్రం కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.
- వింజమూరు మండలం కాటేపల్లి, చాకలికొండ, బత్తినవారిపల్లి, ఊటుకూరు, వింజమూరు, తదితర ప్రాంతాల్లో పెద్ద మొత్తంలో భూములు ఆక్రమణకు గురయ్యాయి. అధికారులు ఇప్పటికైనా చిత్తశుద్ధితో వ్యవహరించి పెద్ద మొత్తంలో ఆక్రమణకు గురైన భూములను స్వాధీనం చేసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అక్టోబరు 28న ప్రకాశం జిల్లా పామూరుకు చెందిన టీడీపీ నేతలైన పువ్వాడి రాంబాబు, ఆయన బావ కూండ్ల సురేంద్ర జలదంకి మండలం బ్రాహ్మణకాకకు చెందిన పరాంకుశం వెంకట గోపాలాచార్యులు, కుందూరు తిరుపతిరెడ్డి ద్వారా బోగస్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ విషయం ఎవరికి తెలియకుండా కొంతకాలంగా గోప్యంగా ఉంచారు. 2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు రాంబాబు, సురేంద్ర అప్పటి తహసీల్దార్ చొప్పా రవీంద్రబాబుకు మ్యూటేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. తహసీల్దార్ రికార్డులు పరిశీలించకుండానే రెవెన్యూ రికార్డులో వారి పేర్లను నమోదు చేశారు. అయితే డిజిటల్ కీ రిలీజ్ చేయలేదు. ఎన్నికలు జరగడం, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడంతో మౌనంగా ఉన్నారు. 2023లో తమ పేర్లు రెవెన్యూ రికార్డులో ఉన్నా, డిజిటల్ కీ వదల్లేదని అప్పటి జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్‌కు రాంబాబు, సురేంద్ర వినతిపత్రం ఇచ్చారు. జేసీ ఈ భూమి దేవాలయానికి సంబంధించినదిగా నిర్ధారిస్తూ, వెంటనే రెవెన్యూ రికార్డుల్లో శ్రీమదన వేణుగోపాలస్వామి పేరు నమోదు చేసి, 22ఏ నిషేధ జాబితాలో చేర్చాలని ఆర్‌సీ డీ5.589 పేరుతో 26.10.2023 తేదీన వరికుంటపాడు తహసీల్దార్‌కు ప్రొసీడింగ్స్ ఇచ్చారు. అయితే రెవెన్యూ అధికారులు రికార్డుల్లో ఆ మార్పులు చేయలేదు.

రూ.8 కోట్ల భూమి కబ్జా యత్నం

వెంకటాచలం మండలం చవటపాళెం పంచాయతీలో జాతీయ రహదారి అనుకుని ఎర్రగుంటలో టోల్‌ప్లాజా, అక్షర విద్యాలయం, రవీంద్రభారతి స్కూల్‌కు మధ్యలో సర్వే నంబరు 583లో 8 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి (ఎర్రగుంట) ఉంది. ఈ ఎర్రగుంటలో ఎప్పుడూ నీళ్లు ఉండడంతో పశువులకు ఎండా కాలంలో ఇక్కడే సేద తీరేవి. అయితే టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే టీడీపీ నేతల కన్ను విలువైన ఎర్రగుంటపై పడింది. అనుకున్నదే తడువుగా రాత్రికి రాత్రే జేసీబీతో సుమారు 4 ఎకరాల మేరకు గుంటను పూడ్చి కబ్జాకు పాల్పడ్డారు. ఈ ప్రాంతంలో ఎకరా భూమి ధర సుమారు రూ.2 కోట్లు పలుకుతోంది. ఈ లెక్కన రూ.8 కోట్లు ఉంటుందని అంచనా. భూ కబ్జా వెలుగులోకి రావడంతో తమ్ముళ్లు వెనకడుగేశారు.

- ఇదే మండలం గొలగమూడిలో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ జరిగిన మరుసటి రోజే ఆశ్రమ గిరిజన ఉన్నత పాఠశాల కోసం కేటాయించిన 1.25 ఎకరాల భూమిని టీడీపీ నేత దౌర్జన్య పూరితంగా ఆక్రమించాడు. ఈ భూ ఆక్రమణను ఆశ్రమ గిరిజన పాఠశాల ఉపాధ్యాయినులు అడ్డుకోబోతే వారిని సైతం బెదిరించారు. ప్రస్తుతం అతని ఆధీనంలో ఉంది.

కల్లూరుపల్లిలో 1.7 ఎకరాలు లేఅవుట్లో కలిపేశారు

నెల్లూరురూరల్ నియోజకవర్గంలోని కల్లూరుపల్లి పరిధిలోని సర్వే నంబర్ 8లో కల్లూరుపల్లి పెద్ద చెరువు భూమిలో 1.7 ఎకరాలు స్థానిక టీడీపీ నాయకులు ఆక్రమించారు. ఈ భూమిని పక్కనే టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన లేఅవుట్‌ను ఏర్పాటు చేసి చదును చేశారు. సుమారు 60–70 ప్లాట్లును వేశారు. 9 అంకణాల లెక్కన ప్లాట్లను సిద్ధం చేశారు. ఈ స్థలాలను స్థానిక టీడీపీ నాయకులు, అనుచరులు, వర్గీయులకు కట్టబెట్టారు. టీడీపీ నేతల తీరుపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారం వచ్చి 4 నెలలు కూడా గడవక ముందే టీడీపీ నేతల తమ అసలు రూపాన్ని చూపిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు.

ప్రభుత్వ భూముల స్వాహా

- గండిపాళెం జలాశయం లోతట్టు ప్రాంతాల ఆక్రమణ
- మినుము, జామాయిల్ సాగుకు సన్నాహాలు

ఉదయగిరి: మండలంలోని చౌడేపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని సీజేఎఫ్ఎస్, గండిపాళెం జలాశయం లోతట్టు ప్రాంతాల్లో సుమారు వందెకరాల భూమిని కొంత మంది అక్రమార్కులు ఆక్రమించి దున్ని మినుము, జామాయిల్ సాగు చేసే ప్రయత్నాలు చేస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది. జలాశయం లోతట్టు ప్రాంతంలో అత్యంత సారవంతమైన భూములు కావడంతో ఇక్కడ ఏ పంట సాగు చేసినా అధిక దిగుబడితో పాటు మంచి ఆదాయం వచ్చే అవకాశముంది. ఈ ప్రాంతంలో భూమి ఎక్కువ ధర పలుకుతోంది. దీంతో ఈ భూములపై కన్నేసిన అధికార పార్టీకి చెందిన బడా నేతలు ఆక్రమించి యంత్రాల సాయంతో చెట్ల పొదలు తీసి సాగు చేసేందుకు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే కొంత భూమిలో మినుము పైరు కూడా సాగు చేశారు. అయితే ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ భూముల ఆక్రమణ విషయమై స్థానిక విలేకరులు తహసీల్దార్ సుభద్ర దృష్టికి తీసుకురాగా ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని, పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాల్సిందిగా ఆర్ఐ, వీఆర్వోలను ఆదేశించినట్లు ఆమె తెలిపారు.

బరి తెగిస్తున్న భూకబ్జాదారులు

ఉదయగిరి మెట్ట ప్రాంతంలో జాతీయ రహదారులు నిర్మాణంలో ఉన్న నేపథ్యంలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. దీంతో దుత్తలూరు, ఉదయగిరి, సీతారామపురం మండలాల్లో అధికార పార్టీకి చెందిన కొంత మంది వ్యక్తులు ప్రభుత్వ భూమి ఎక్కడ కనిపిస్తే అక్కడ రాత్రికి రాత్రే ఆక్రమించి చదును చేసి పంటలు సాగు చేస్తున్నారు. తమకున్న రాజకీయ పలుకుబడితో యథేచ్ఛగా భూములు ఆక్రమిస్తున్నా.. రెవెన్యూ అధికారులు వారి వైపు కన్నెత్తి కూడా చూడడం లేదనే విమర్శలున్నాయి. సామాన్యులు సెంటు భూమి ఆక్రమిస్తే ప్రతాపం చూపించే రెవెన్యూ అధికారులు అధికార పార్టీ వ్యక్తుల జోలికి వెళ్లకపోవడంపై సామాన్యుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రభుత్వ భూములు కాపాడాల్సిన రెవెన్యూ అధికారులకు స్థానికంగా ఫిర్యాదులు చేసినప్పటికీ పట్టించుకోకపోవడం విశేషం. వారం రోజుల క్రితం ఉదయగిరి మండలంలోని ఆర్లపడియ పంచాయతీలో రాత్రికి రాత్రే సుమారు వందెకరాలు ఆక్రమించి చదునుచేసి భూ ఆక్రమణకు పాల్పడ్డారు. దీనిపై రెవెన్యూ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేసినా విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారు. మండలంలో విలువైన, సారవంతమైన భూములు అధికార పార్టీ పెద్దలు ఆక్రమిస్తున్నా రెవిన్యూ అధికారులు నోరుమెదపకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమౌతున్నాయి.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

- బాధితురాలికి న్యాయం జరగకపోతే పోరాటం చేస్తాం
- ఎంఆర్‌పీఎస్ నేతలు

ఆత్మకూరు: ఇంటర్మీడియట్ చదివే మైనర్ అయిన దళిత బాలికను మాయమాటలతో మోసం చేసి, ఆమె కళాశాల చదువుకు ఆటంకం కల్పించి జీవితాన్ని అన్యాయం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని, బాధిత బాలికకు న్యాయం చేయాలని ఎంఆర్‌పీఎస్ నాయకుడు పందిరి సుబ్బయ్య తదితరులు డిమాండ్ చేశారు. ఆత్మకూరులోని జిల్లా ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలికను, తల్లిదండ్రులను ఆదివారం కలిసి ఓదార్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధిత బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్ర స్థాయి ఉద్యమంగా చేస్తామని చెప్పారు. అనంతసాగరం మండలం కొత్తపల్లి దళితకాలనీకి చెందిన మైనర్ బాలికను లింగంగుంట గ్రామానికి చెందిన పెట్రోల్ బంకులో పనిచేసే హుస్సేన్ పెళ్లి చేసుకుంటానని, మాయమాటలు చెప్పి శారీరకంగా లోబరుచుకున్న విషయం తెలిసిందే. బాలికతో సన్నిహితంగా ఉన్న వీడియోలను ఆమె చదివే కళాశాలలోని పలువురికి, గ్రామంలోని వారికి వాట్సప్‌లో పోస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో పందిరి సుబ్బయ్యతో పాటు ఆత్మకూరు నాగయ్య, బాబు, తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో బాధిత బాలిక తల్లిని పరామర్శిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

బాధితురాలిని పరామర్శించిన ఆర్డీఓ

నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మైనర్ బాలికను ఆత్మకూరు ఆర్డీఓ బి.పావని ఆదివారం రాత్రి ఆత్మకూరు జిల్లా ప్రభుత్వాస్పత్రి వెళ్లి పరామర్శించారు. ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఆమెకు పూర్తి న్యాయం జరిగేలా అధికారులతో మాట్లాడనున్నట్లు ఆర్డీఓ తెలిపారు. ఆమె వెంట రెవెన్యూ సిబ్బంది, ఆసుపత్రి వైద్యులు ఉన్నారు.

బాలికల వసతిగృహాలను తనిఖీ చేసిన జడ్జి



వసతిగృహాన్ని తనిఖీ చేస్తున్న జడ్జి శోభ

బిట్రగుంట: కప్పరాళ్లతిప్పలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులం, కావలిలోని ఎస్టీ బాలిక వసతిగృహాలను కావలి సీనియర్ సివిల్ జడ్జి ఎం శోభ ఆదివారం తనిఖీ చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు వసతిగృహాల్లో విద్యార్థినులకు కల్పిస్తున్న వసతులు, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. తాగునీటి సరఫరా, పరిసరాల శుభ్రత, మెడికల్ కేర్, విద్యాబోధన తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. జడ్జి వెంట ప్రిన్సిపల్ పద్మావతి, లీగల్ ఎయిడ్ మెంబర్, న్యాయవాది సాయిప్రసాద్, లోక్‌అదాలత్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే నెల్లూరుకు విమానాశ్రయం



మాట్లాడుతున్న మంత్రులు పొంగూరు, ఆనం

- రైస్‌మిల్లులను తరలించే ప్రక్రియకు చర్యలు
- మిల్లర్ల యజమానులు సహకరించాలి
- వ్యాపారస్తుల్ని ప్రోత్సహించడమే ప్రభుత్వ ఉద్దేశం
- కలెక్టరేట్‌లో మంత్రులు పొంగూరు, ఆనం సమీక్ష

నెల్లూరు(దర్గామిట్ట): త్వరలోనే జిల్లాలో విమానాశ్రయం పనులు ప్రారంభిస్తామని మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో ఆయన మరో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్‌తో కలిసి ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో రైస్ మిల్లులు ఎక్కువగా ఉన్నాయన్నారు. రైస్‌మిల్స్ ఉన్న ఏరియాల్లో నాలుగు రెట్లు ఎక్కువగా కాలుష్యం ఉందన్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనల మేరకు ఆ రైస్‌మిల్లులను దూర ప్రాంతాలకు తరలించాల్సి ఉందన్నారు. గతంలో తాను మంత్రిగా ఉన్న సమయంలోనే ఈ సమస్యపై మూడు అసోసియేషన్లతో చర్చించినట్లు గుర్తు చేశారు. అయితే ఇప్పుడు వారికి ఎటువంటి నష్టం జరగకుండా, ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆయా ప్రాంత ఎమ్మెల్యేలు, కలెక్టర్‌తో చర్చించి ఏర్పాటు చేసుకోవాలన్నారు. కిసాన్ ఎస్ఈజెడ్, కృష్ణపట్నం పోర్ట్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకోవచ్చునన్నారు. వ్యాపారస్తుల్ని ప్రోత్సహించడమే ఈ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమన్నారు. అందుకే రైస్‌మిల్లర్ల యజమానులు, అసోసియేషన్ నాయకులు అందరూ ఒక నిర్ణయానికి వచ్చి ప్రభుత్వానికి సహకరించాలని ఆయన కోరారు. రోడ్డు, రైలు, విమాన, ఓడరేవు మార్గాలు అభివృద్ధి చెందితే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందన్నారు. నెల్లూరుకు విమానయానం అవసరం ఉందన్నారు. కృష్ణపట్నం పోర్టు, ఇంకా మరికొన్ని పోర్టులు కూడా వచ్చేశాయన్నారు. వాటిలో కార్గో చాలా ముఖ్యమైందన్నారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ నెల్లూరు నగరం చుట్టూ ఉన్న రైస్ మిల్లులను ఇతర ప్రాంతాలకు తరలించాలని భావిస్తున్నామన్నారు. ఒకప్పుడు నగర శివార్లలో ఉన్న ఈ మిల్లులు నేడు నగరం విస్తరించడంతో నడిబొడ్డులోకి వచ్చాయన్నారు. జిల్లాకు ఎంతో అవసరమైన దగదర్తి విమానాశ్రయ పనులు కూడా త్వరలో ప్రారంభించేందకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. విమానాశ్రయానికి 1,379 ఎకరాలు అవసరమని గుర్తించామని చెప్పారు. అయితే ఇంకా భూమి సేకరించాల్సి ఉందన్నారు. ఈ విషయమై కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుతో చర్చిస్తామని తెలిపారు. త్వరలో ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి ప్రతినిధులు వచ్చి పరిశీలన చేస్తారని మంత్రి ఆనం అన్నారు.

కాగుతున్న వంట నూనెల ధరలు



- మూడు రోజుల్లో 15 లీటర్ల డబ్బాపై రూ.270 పెరుగుదల

కావలి: పండగకు ముందు నూనె ధరలు సామాన్యులకు షాక్ ఇస్తున్నాయి. వివిధ రకాల నూనెల ధరలు రోజురోజుకు ఎగబాకుతున్నాయి. ధరలు పెరగడంతో ప్రజల వంటగది బడ్జెట్‌ను మరింతగా పెంచేసినట్లు అయింది. దిగుమతి సుంకాన్ని భారీగా పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ధరలు పెరిగాయని అధికారులు సమర్థించుకుంటున్నారు. ముడి పామాయిల్, సోయాబీన్, సన్‌ఫ్లవర్ నూనెలపై దిగుమతి సుంకాన్ని 20 శాతం పెంచింది. దేశీయంగా నూనె గింజల ధరలు పడిపోతున్న నేపథ్యంలో ఇక్కడి రైతులకు ప్రయోజనం కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం ప్రభుత్వం ప్రకటించిందని అధికారులు చెబుతున్నారు. దీపావళి పండగకు ముందు వంట నూనెల ధరలు అమాంతం పెరిగాయి. గత నెలలో రూ.100 ఉన్న లీటర్ పామాయిల్ ధర రూ.137కు చేరగా, సోయాబీన్ రూ.120 నుంచి రూ.148, సన్‌ఫ్లవర్ రూ.120 నుంచి రూ.149, ఆవ నూనె రూ.140 నుంచి రూ.181, వేరుశనగ నూనె రూ.180 నుంచి రూ.184 మేర పెరిగాయి. కొన్ని నెలలుగా వంట నూనెల ధరలు భారీగా పెరగడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. దీంతో ప్రస్తుతం పండగల సమయంలో సామాన్యులపై మరో భారం పడింది. వంట నూనెలపై కేంద్రం దిగుమతి సుంకం పెంచడంతో వాటి ధరలు అమాంతంగా పెరిగాయి. 15 లీటర్ల పామాయిల్ డబ్బా ధర శుక్రవారం వరకు రూ.1,730 ఉండగా, శనివారానికి రూ.1,950, ఆదివారానికి రూ.2,000 వేలు దాటింది. కిలో ప్యాకెట్ ధర రూ.108 నుంచి రూ.125కు పెరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి కిలో ఆయిల్ ప్యాకెట్‌కు అదనంగా రూ.5 పెంచి విక్రయిస్తున్నారు. దీంతో వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు. వంట నూనెల ధరల పెంపుపై ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికే పెరిగిన నిత్యావసర ధరలతో సతమతమవుతున్న తమపై ఈ భారం మోపడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు. వంటింటి బడ్జెట్ ఒక్కసారిగా పెరిగిందని సామాన్య, మధ్య తరగతి కుటుంబాల వారు, హోటల్ నిర్వాహకులు వాపోతున్నారు.

క్లుప్తంగా

చుట్టుగుంట ఆక్రమణ తొలగింపు



మామిడి మొక్కలు పీకేసిన అనంతరం చుట్టుగుంట ఇలా..

సాక్షి ఎఫెక్ట్..

ఉలవపాడు: చుట్టుగుంట ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు స్పందించారు. మండల పరిధిలోని కరేడు పంచాయతీలోని చుట్టుగుంటలో సర్వే నంబర్ 1538 – 2లో 4.75 ఎకరాల భూమిని టీడీపీ మద్దతుదారుడు చలంచర్ల ఆంజనేయులు ఆక్రమించి మామిడి మొక్కలు వేశాడు. దీనిపై సాక్షిలో ఈనెల 20వ తేదీన ఆక్రమణల చెరలో చుట్టుగుంట అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. కలెక్టర్ ఆనంద్ ఆదేశాల మేరకు తహసీల్దార్ లావణ్య ఆక్రమణ దారుడితో మాట్లాడారు. వీఆర్వోని పంపించి మొక్కలను తొలగించాలని చెప్పారు. దీంతో ఆంజనేయులు మొక్కలను తొలగించాడు. ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

చేపల వేటకు వెళ్లి..

- గిరిజనుడి మృతి



రాంబాబు మృతదేహం

కోవూరు: చేపల వేటకు వెళ్లిన ఓ గిరిజనుడు ప్రమాదవశాత్తు పెన్నానదిలో పడి మృతిచెందిన ఘటన ఆదివారం మండలంలోని జమ్మి పాళెంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కోవూరు కొత్తూరు రామాలయం సమీపంలో నివాసముంటున్న చింతా రాంబాబు (40)కు ఈత సక్రమంగా రాదు. అయినా పెన్నా నదిలో చేపల వేటకు వెళ్లాడు. ఈ క్రమంలో నీటిలో దిగి మునిగిపోయాడు. సమీపంలోని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. కోవూరు ఎస్సై రంగనాథ్‌గౌడ్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఫైర్ సిబ్బందిని పిలించారు. ఈలోగా రాంబాబు చనిపోయి కనిపించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోవూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ముస్లిం సమాజ ప్రగతికి వక్ఫ్ చట్టం అవరోధం

- అమలును నిలువరించాలి
- జమాఅతె ఇస్లామి హింద్ డిమాండ్




మాట్లాడుతున్న అబ్దుర్రెహ్మాన్ సూఫీ

నెల్లూరు(బృందావనం): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ యాక్ట్ వల్ల ముస్లిం సమాజం పరిస్థితి మరింత దిగజారిపోతుందని, వారి ఉన్నతికి ఆ చట్టం అవరోధమని రాష్ట్ర వక్ఫ్ పరిరక్షణ కమిటీ సభ్యుడు, జమాఅతె ఇస్లామి హింద్ ఆంధ్రప్రదేశ్ నేత అబ్దుర్రెహ్మాన్ సూఫీ తెలిపారు. నెల్లూరు కన్వీనర్ సయ్యద్ నవీద్ అహ్మద్ ఆధ్వర్యంలో నెల్లూరు జెండా వీధి పొనగల్ రాజారోడ్డులోని నగర శాఖ కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఇందులో నగరంలోని వివిధ మసీదులకు చెందిన అధ్యక్షులు, దర్గా ముతవల్లీలు, మైనార్టీ నేతలు, ఉలెమాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అబ్దుర్రెహ్మాన్ సూఫీ మాట్లాడుతూ నేటి ప్రభుత్వాలు వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతం అవుతుంటే చేష్టలుడిగి చూస్తుండిపోయాయే తప్ప రక్షణకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ ఆస్తులు ముస్లింలు కోల్పోయే విధంగా చట్టాన్ని సమూలంగా మార్చడం దారుణమని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ తీరును యావత్తు ముస్లిం సమాజం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని స్పష్టం చేశారు. దశలవారీ పోరాటాలు చేపట్టామన్నారు. కేంద్రం తీరును నిరసిస్తూ నవంబర్ 3వ తేదీన విజయవాడలో వక్ఫ్ పరిరక్షణ మహాసభ నిర్వహిస్తున్నామని వెల్లడించారు. జిల్లా నుంచి వేలాదిమంది పాల్గొని జయప్రదం చేయాలని, సంఘటితంగా వక్ఫ్ ఆస్తుల రక్షణకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక జమాత్ అధ్యక్షుడు అన్వర్, జమాలుల్లా, 42వ డివిజన్ కార్పొరేటర్ కరీముల్లా, వివిధ పార్టీలకు చెందిన నాయకులు జాకీర్, ఆసిఫ్ పాషా, జియావుల్ హక్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	:134
లేయర్ (లైవ్)	:110
బ్రాయిలర్ చికెన్	:240
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:266
లేయర్ చికెన్	:187




పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	:రూ.35
సన్నవి	:రూ.20
పండ్లు	:రూ.10



పచ్చనేతల దోపిడీకి కొత్త స్కెచ్



తెలుగు తమ్ముళ్లకు దోచి పెట్టేందుకు కూటమి ప్రభుత్వం కొత్త కొత్త విధానాలను తెరపైకి తెస్తోంది. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యాక ఆ పార్టీ నాయకులు ప్రకృతి వనరులను కొల్లగొడుతున్నారు. తాజాగా వారి కళ్లు ఉపాధి పనులపై పడ్డాయి. అధికారాన్ని అడ్డు పెట్టుకుని కింద స్థాయి నేతల జేబులు నింపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీనిపై స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.



వింజమూరు మండలంలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులు

ఉదయగిరి: సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యుల్లో వైఎస్సార్‌సీపీ చెందిన వారే అధికంగా ఉన్నారు. నిబంధన మేరకు ఉపాధి హామీ పనులు సర్పంచ్‌ల ద్వారానే జరగాలి. కానీ కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల అధికారాలను పక్కనపెట్టి తన పార్టీలకు చెందిన వారికి 'వెండర్' పేరుతో దోచి పెట్టేందుకు చర్యలు తీసుకుంది.. 2014లో ఉన్న జన్మభూమి కమిటీ తరహాలో ఇప్పుడు వెండర్ (కాంట్రాక్టర్) విధానం తెరపైకి తెచ్చింది. దీని పేరుతో కూటమి నేతలే పనులు చేసేందుకు కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. కోట్ల రూపాయలు కొల్లగొట్టేందుకు మార్గం కల్పించింది.

సర్పంచ్‌లు, ఎంపీటీసీలు డమ్మీ

అధికారంలోకి వచ్చేందుకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీల మీద కూటమి నేతలు విపరీతమైన ప్రేమ ఒలకబోశారు. వారికి అపరిమితమైన హక్కులు కల్పిస్తామని, స్థానిక సంస్థలను బలోపేతం చేస్తామని చంద్రబాబు, పవన్ ఊకదంపుడు ఉపన్యాసాలు చేశారు. తీరా అధికారం చేపట్టిన తర్వాత అందుకు విరుద్ధమైన విధానాలతో ముందుకెళ్తున్నారు. తమ హక్కులు కాలరాసేలా కూటమి ప్రభుత్వం చేస్తున్న పనులపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

పక్కాగా..

2014 – 19 కాలంలో చంద్రబాబు జన్మభూమి కమిటీలను ఏర్పాటు చేశారు. గ్రామంలో ఏ పని కావాలన్నా అధికార పార్టీ నేతలతో కూడిన ఈ సభ్యుల ఆమోదం అవసరమయ్యేది. ఈ విధానం ద్వారా చంద్రబాబు ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులను జీరో చేశారు. రాజకీయ నేపథ్యం గల వారితో ఏర్పాటు చేసిన కమిటీలకే సర్వహక్కులు కల్పించారు. దీంతో ఎంతోమంది అర్హులకు న్యాయం జరగలేదు. తమ జేబులు నింపుకొనేందుకే కమిటీలు అధిక ప్రాధాన్యమిచ్చాయి. సామాన్యులు పడిన బాధలు వర్ణనాతీతం. ఇప్పుడు కూడా అదే విధానంలో కూటమి ప్రభుత్వం వెండర్ విధానం అమలు చేసి దోపిడీకి పక్కా ప్లాన్ వేసుకుంది.

కోట్ల రూపాయల ఖర్చుతో పనులు

జిల్లాలో సిమెంట్ రోడ్లు, కాలువలు, తారు రోడ్లు, పశువుల షెడ్ల నిర్మాణం కోసం ఉపాధి హామీ పథకం కింద నిధులు మంజూరయ్యాయి. ఈ పనులకు సర్పంచ్‌లు తీర్మానాలు అవసరమైనా, అవేమీ పట్టించుకోకుండా కూటమి ప్రభుత్వం తమ పార్టీ నేతలకు కట్టబెడుతోంది. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉపాధి పనులకు రూ.కోట్లు ఖర్చు చేస్తున్నట్లు గొప్పలు చెబుతున్నారు. అంతేకాకుండా పల్లె పండగ పేరుతో గ్రామాల్లో పనులకు ప్రజాప్రతినిధులు శంకుస్థాపనలు చేశారు. కానీ స్థానిక సర్పంచ్‌లకు స్థానం లేకుండా అధికార పార్టీ వారే అంతా తామై నడిపిస్తూ పనులు చేస్తున్నారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలను పూర్తిగా విస్మరించి గ్రామ స్వరాజ్యాన్ని అపహాస్యం చేశారనే విమర్శలున్నాయి.

అధికారులు ఏం చెబుతున్నారంటే..

దీనిపై అధికారులు ఇలా చెబుతున్నారు. గ్రామసభల ద్వారా ఆమోదం పొందిన పనులకే వెండర్స్‌ను నియమించారని, వారి ద్వారానే పనులు చేపట్టామంటున్నారు. పనులు పారదర్శకంగా, నాణ్యతగా చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు చెప్పామని వెల్లడిస్తున్నారు.

నిలదీసినా..

కొండాపురం మండలంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఉపాధి హామీ నిధులతో జరిగే సిమెంట్ రోడ్డు పనులకు పంచాయతీ తీర్మానం అవసరమా.. లేదా అని స్పష్టత ఇవ్వాలంటూ పలువురు సర్పంచ్‌లు అధికారులను నిలదీశారు. దీనికి స్పందించిన పీఆర్ ఏఈ వాణి పంచాయతీల తీర్మానం అవసరం లేదు. కలెక్టరేట్, ఎమ్మెల్యే కార్యాలయం నుంచి టీడీపీ నేతలచే పనులు చేయించాలని ఆదేశాలు వచ్చినట్లు వివరించారు. ఈ విధానం పూర్తిగా జాతీయ ఉపాధి హామీ నిబంధనలకు విరుద్ధం. దీనిని బట్టి అధికారులపై కూటమి నేతల ఒత్తిడి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

జిల్లాలో పనుల వివరాలిలా..

పనులు	లక్ష్యాలు
సిమెంట్ రోడ్లు	70 కి.మీ
సైడ్ కాలువలు	47 కి.మీ
తారు రోడ్లు	23 కి.మీ
గోకులాలు	1,300
పంట కుంటలు	5,280
మొక్కల పెంపకం	175 కి.మీ
ఊటకుంటలు	550



సీతారామపురంలో సీసీ రోడ్ల నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే (ఫైల్)

వెండర్స్‌కు అప్పగించడం చట్టవిరుద్ధం



ఉపాధి పనులు సర్పంచ్‌లకు కాకుండా వెండర్స్ (కాంట్రాక్టర్లకు) అప్పగించడం చట్టవిరుద్ధం. ఈ పనులు సర్పంచ్‌ల ఆధ్వర్యంలోనే జరగాలని ఉపాధి హామీ పథకం చట్టంలో స్పష్టంగా ఉంది. వెండర్స్‌కు పనులు అప్పగించడమంటే సర్పంచ్‌ల హక్కులు కాలరాయడమే అవుతుంది.

– గోపీ, సర్పంచ్

అటవీ భూముల్లో ఇసుక దందా

- యథేచ్ఛగా ట్రాక్టర్లతో తరలింపు
- టీడీపీ నాయకుల నిర్వాకం
- పట్టించుకోని అటవీ శాఖ అధికారులు



అలగాయపాళెం సమీపంలో అటవీ భూమిలో ఇసుక తవ్వకాలు

ఉలవపాడు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రకృతి సంపదకు తీవ్ర నష్టం జరుగుతోంది. రిజర్వు ఫారెస్ట్ నుంచి ఇసుక తరలివెళ్తున్నా అటవీ శాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాల్లేవు. జేసీబీలతో పెద్దపెద్ద గుంతలు పెట్టి ట్రాక్టర్లతో తరలిస్తున్నా చీమకుట్టినట్లయినా లేదు. అటవీ భూమిని కాపాడడమే ధ్యేయంగా విధులు నిర్వహించాల్సిన ఉద్యోగులు మాకెందుకులే అన్నట్లు వ్యవహరించడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీకి సంబంధించిన నాయకులు ఇందులో కీలకపాత్ర పోషిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే అండతో ఈ తంతు జరుగుతోందన్న విషయం బహిర్గతమే. తమకు సంబంధించిన వారి ట్రాక్టర్లను పట్టుకోవద్దని ముందే అధికారులకు చెప్పినట్లు సమాచారం.

ఆదాయవనరుగా..

మండల పరిధిలో సుమారు 9,200 ఎకరాల రిజర్వు ఫారెస్ట్ భూమి ఉండగా 2,300 ఎకరాల్లో ఇసుక నిల్వలున్నాయి. జీడి మామిడి, జామాయిల్, సరుగుడు లాంటి చెట్లు ఉన్నాయి. కొంత ఖాళీ భూమి ఉంది. ఇదే ఇప్పుడు టీడీపీ నాయకులకు ఆదాయవనరుగా మారింది.

జరుగుతున్న తీరు ఇదీ..

చాకిచర్ల సెక్షన్ పరిధి కొల్లూరుపాడు బీట్‌లోని కరేడు, చాకిచర్ల గ్రామాల్లోని భూమి, గుడ్లూరు మండలంలోని తెట్టు సెక్షన్ పరిధిలోని ఉలవపాడు మండలం రామాయపట్నం భూముల్లో అధికంగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. ఫారెస్ట్ లెక్కల ప్రకారం కంపార్ట్‌మెంట్ నంబర్ 383లో కరేడు భూమి, 384లో చాకిచర్ల భూమితోపాటు రామాయపట్నంలోని వందెకరాల అటవీ భూమి నుంచి రవాణా చేస్తున్నారు. ఈ నెలలో సుమారు ఏడువేల ట్రాక్టర్ల ఇసుక తరలించినట్లు సమాచారం. ప్రస్తుతం అలగాయపాళెంలో ఉన్న అటవీ శాఖ నర్సరీ సమీపంలో ఇసుక తరలిస్తున్నారు.

అండగా అధికారులు

చాకిచర్ల, తెట్టు సెక్షన్లకు బీట్ ఆఫీసర్లు, సెక్షన్ అధికారులున్నారు. కానీ వీరంతా విధులను మర్చిపోయారు. స్థానిక ఎమ్మెల్యేకు, టీడీపీ నాయకులకు అండగా ఉంటూ వారి దోపిడీకి అండగా నిలుస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ ప్రాంతంలో హేచరీల నిర్మాణానికి అధిక మొత్తంలో ఇసుక అవసరం ఉంటుంది. అలాంటి వారు స్థానిక టీడీపీ లీడర్లను కలిస్తే పని అయిపోయినట్లే. ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు కలిసి చేస్తున్న దందాను వెంటనే అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రైల్లో నుంచి పడి..

- వేర్వేరు చోట్ల ఇద్దరు వ్యక్తుల మృతి



మృతదేహం

కొడవలూరు: రైల్లో నుంచి పడి తీవ్రంగా గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన ఆదివారం జరిగింది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. సుమారు 30 – 35 సంవత్సరాల మధ్య వయసున్న గుర్తు తెలియని వ్యక్తి మండలంలోని నాయుడుపాళెం రైల్వే గేటు వద్ద ఆదివారం ఉదయం రైల్లో నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడని రైల్వే పోలీస్‌స్టేషన్ దర్యాప్తు అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. మృతుడు లేత కుంకుమ రంగు హాఫ్ హ్యాండ్స్ టీ షర్ట్, పచ్చ రంగు చొక్కా ధరించి ఉన్నాడు. మృతుడి సమాచారం తెలిస్తే 94406 27648 ఫోన్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.



మృతదేహం

■ కోవూరు: రైల్లో నుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని పడుగుపాడు రైల్వేస్టేషన్ పరిధిలోని నందలగుంట వద్ద ఆదివారం జరిగింది. రైల్వే పోలీస్‌స్టేషన్ దర్యాప్తు అధికారి శ్యామ్‌కుమార్ కథనం మేరకు.. సుమారు 30 సంవత్సరాల వయసున్న వ్యక్తి దిగువ లైన్‌లో వెళ్లే రైల్లో నుంచి జారిపడి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. అతను నలుపు రంగు ఫుల్ హ్యాండ్స్ షర్ట్, ప్యాంట్ ధరించి ఉన్నాడు. ఎడమ చేయి మోచేతి కింద త్రిశూలం సింబల్ పచ్చ బొట్టు ఉంది. మృతదేహాన్ని కావలి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలని శ్యామ్‌కుమార్ కోరారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తుండగా..

- మూడు టిప్పర్ల స్వాధీనం
- మైనింగ్ అధికారులకు అప్పగింత



కొడవలూరు పోలీస్‌స్టేషన్‌లో ఉన్న టిప్పర్లు

కొడవలూరు: ప్రకాశం జిల్లాకు ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు టిప్పర్లను కొడవలూరు పోలీసులు ఆదివారం తెల్లవారుజామున పట్టుకున్నారు. వివరాలు.. రాత్రి వేళల్లో ఇతర జిల్లాలకు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో ఎస్సై సీహెచ్ కోటిరెడ్డి తన సిబ్బందితో హైవేపై కాపు కాశారు. మూడు టిప్పర్లు ఇసుకను తీసుకెళ్తుండగా నార్తురాజుపాళెం సమీపంలో నిలిపి విచారించారు. అనుమతి లేకుండా నెల్లూరు రూరల్ మండలం పొట్టేపాళెం నుంచి ప్రకాశం జిల్లాకు వెళ్తున్నట్లు నిర్ధారించుకుని మూడు టిప్పర్లను స్వాధీనం చేసుకుని మైనింగ్ అధికారులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అనుమతుల్లేకుండా ఇతర జిల్లాలకు ఇసుక తరలించరాదన్నారు. అలా తరలిస్తే పట్టుకుని మైనింగ్ అధికారులకు అప్పగించడం జరుగుతుందని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం: మోటార్‌బైక్ అదుపు తప్పి ఇద్దరు వ్యక్తులు గాయపడిన ఘటన మండలంలోని గొలగమూడి క్రాస్‌రోడ్డు సమీపంలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. గూడూరుకు చెందిన కృష్ణమూర్తి, ప్రసాద్‌రావులు పని నిమిత్తం బైక్‌పై నెల్లూరుకు బయలుదేరారు. గొలగమూడి సమీపానికి వచ్చేసరికి ఎదురుగా ఆటో అడ్డు రావడంతో బైక్ అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో కృష్ణమూర్తి, ప్రసాద్‌రావులు గాయపడ్డారు. స్థానికులు గుర్తించి వారిని చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

నెల్లూరు నగరంలో స్పెషల్ డ్రైవ్



వాహన తనిఖీలు చేస్తున్న వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ కిశోర్‌కుమార్



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న నవాబుపేట ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా

నెల్లూరు(క్రైమ్): నేర నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా ఆదివారం రాత్రి పోలీసు అధికారులు నెల్లూరు నగరంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేశారు. నిబంధనలు పాటించని, లైసెన్స్‌లు లేని వాహనదారులపై జరిమానాలు విధించారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. రికార్డులు సక్రమంగా లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ఏడు కేసులు, బహిరంగ మద్యసేవనంపై 18 కేసులు నమోదు చేశారు. రికార్డులు సక్రమంగా లేని 15 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

- నగర పరిధిలోని పలు ప్రాంతాల్లో పోలీస్ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

ఇళ్లు విడిచి బయటకు వెళ్లేవారు విధిగా ఎల్‌హెచ్‌ఎంఎస్ (లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం) సేవలను వినియోగించుకోవాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఆన్‌లైన్ రుణాల జోలికి వెళ్లరాదని సూచించారు. ఆన్‌లైన్ స్నేహాలు మంచివి కావన్నారు. గంజాయి, అనధికార మద్యం విక్రయాలపై సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అత్యవసర వేళల్లో 112కు డయల్ చేస్తే పోలీసులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకుంటారన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో నగర ఇన్‌స్పెక్టర్లు చిట్టెం కోటేశ్వరరావు, అన్వర్‌బాషా, మద్ది శ్రీనివాసరావు, రోశయ్య, కిశోర్‌కుమార్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.